సాక్షి
బాపట్ల
శనివారం । 1 । మార్చి । 2025



నేడు బ్రహ్మంగారి కల్యాణం

విజయపురిసౌత్: గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 'కల్యాణ మహోత్సవం' శనివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 529.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనక దుర్గమ్మకు చండీ హోమం

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పుణ్య దంపతులు కుంకుమ పూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

హామీలను విస్మరించిన బడ్జెట్



రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రభుత్వ హామీలు విస్మరించే బడ్జెట్‌లా ఉంది. భవిష్యత్‌లో ప్రజలపై భారాలు, అప్పులు వేసేలా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. రూ.3.22 లక్షల కోట్ల అంచనాల వ్యయంతో రూపొందించిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి తోడ్పడేలా లేదు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేసేలా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదు. రాష్ట్ర బడ్జెట్ పూర్తి నిరాశాజనకంగా ఉంది. విద్యారంగానికి మొండి చేయి చూపించారు. గత ప్రభుత్వం 11.37 శాతం కేటాయింపులు చేస్తే కూటమి ప్రభుత్వం 10.8 శాతానికి కేటాయింపులు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. వైద్యరంగానికి గత ప్రభుత్వం 6.2 శాతం కేటాయింపులు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం 5.98 శాతంకు తగ్గించటం బాధాకరం. రాష్ట్ర బడ్జెట్‌లో మూడవ వంతు రూ. 1.02లక్షల కోట్ల అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది. అన్నిరంగాలను ఆదుకునే విధంగా బడ్జెట్‌లేదు.

– సిహెచ్ మణిలాల్,
సీపీఎం పట్టణ కార్యదర్శి, రేపల్లె

చేనేతలను పూర్తిగా మరచిన ప్రభుత్వం



చీరాల: వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్ద రంగమైన చేనేత రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. లక్షల మంది కార్మికులు ఆధారపడి జీవించే చేనేత రంగానికి అరకొరగా కేటాయింపులు చేయడం దారుణం. చేనేత రంగానికి ప్రభుత్వం రాయితీలు, తగ్గింపు ధరలకే రంగులు, రసాయనాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను పట్టించుకోకపోవడం గర్హనీయం. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు, చేనేత కార్మికులను ఆదుకునేందుకు పథకాలు ప్రకటిస్తారని ఆశించిన మా చేనేత రంగానికి బడ్జెట్‌తో భంగపాటుకు గురయ్యాం. చేనేతలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారు.

– ఎ.శ్రీనివాసరావు, చేనేత కార్మికుడు,
తోటవారిపాలెం (చీరాల)


గంగపుత్రులు పాలకులకు కనపడటం లేదు



చీరాల: ప్రాణాలను పణంగా పెట్టి గంగమ్మ తల్లిని నమ్ముకుని సముద్రంపైనే ఆధారపడి జీవించే గంగపుత్రులకు బడ్జెట్‌లో కేటాయింపులు పెద్దగా ఇవ్వకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాం. వేట నిషేధ సాయం.. పోయిన ఏడాది కూడా ఇవ్వలేదు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు. మళ్లీ వచ్చే నెలలో వేట నిషేధం వస్తుంది. ఎన్నికల సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎప్పుడు నెరవేరుస్తారో. గంగపుత్రులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారడానికి బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనం.

– ఎరిపిల్లి రమణ, మత్స్యకార సంఘం నేత,
మాజీ సర్పంచ్, వాడరేవు (చీరాల)

యార్డులో 1,11,037 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 96,128 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,11,037 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,100 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,790 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

- ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం
- భవనాశి రిజర్వాయర్ ఆధునికీకరణకు పైసా లేదు
- కొరిశపాడు, యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతలకు మొండిచేయి
- అద్దంకి, రేపల్లెల్లో వంద పడకల ఆసుపత్రులకు నిధులు లేవు
- జిల్లా కేంద్రం బాపట్ల మెడికల్ కళాశాలకు పైసా విదల్చలేదు
- 74 కిలోమీటర్ల తీరప్రాంతంలో పర్యాటకాభివృద్ధి ప్రస్తావన లేదు
- హార్బర్‌లు, మినీ హార్బర్‌లు, ఆక్వా పార్కులకు నిధులు హుళక్కి
- కృష్ణా, సాగర్ కాలువల ఆధునికీకరణ గాలికి ....
- సంక్షేమ పథకాలకు అరకొర నిధులు



నిజాంపట్నం హార్బర్

హామీలు ఫుల్.. కేటాయింపులు నిల్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికారం యావతో అలవికాని హామీలు ఇచ్చి జనాన్ని మభ్యపెట్టి ఓట్లేయించుకున్న కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో నిధులివ్వక మొండిచేయి చూపింది. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని సాగునీటి వనరులకు పైసా ఇవ్వలేదు. 74 కిలోమీటర్ల మేర ఉన్న తీరప్రాంతం అభివృద్ధిని పట్టించుకోలేదు. సంక్షేమ పథకాలకు మొక్కుబడిగా నిధులు కేటాయింపుతో మమ అనిపించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలోని 1,195 ఎకరాలకు సాగు నీరందించే భవనాశి రిజర్వాయర్‌కు రూ.40 కోట్ల నిధులు అవసరం కాగా పైసా ఇవ్వలేదు. కొరిశపాడు, ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయింపులు లేవు. గుంటూరు ఛానల్‌ను విస్తరించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా నిధులు ఇవ్వలేదు. అద్దంకి పట్టణానికి బైపాస్ నిర్మిస్తామని చెప్పిన హామీ ఊసే లేదు. కృష్ణా, నాగార్జున సాగర్ కాలువల ఆధునికీకరణకు మొక్కుబడి నిధుల కేటాయింపుతో చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేకుండా పోయింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్మాణం మొదలు పెట్టిన బాపట్ల మెడికల్ కళాశాలకు పైసా కేటాయించలేదు. 74 కిలోమీటర్లు ఉన్న తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించినా నిధులు ఇవ్వలేదు. నిజాంపట్నం హార్బర్ నిర్మాణం పూర్తితోపాటు ఆక్వా పార్కుకు నిధులు ఇవ్వలేదు.



అద్దంకి భవనాశి రిజర్వాయర్

జిల్లాకు మొండిచేయి




బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి చూపారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి పైసా నిధులు ఇవ్వలేదు. అద్దంకి ప్రాంతంలోని భవనాశి రిజర్వాయర్, ఎర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాలతో పాటు పర్చూరు వరకు గుంటూరు ఛానల్ విస్తరణ నిజాంపట్నం హార్బర్, ఆక్వా పార్కు, చేనేత క్లస్టర్, బాపట్ల మెడికల్ కళాశాలకు నిధుల కేటాయింపులు లేవు. సంక్షేమ పథకాలకు సైతం అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకుంది.

– గంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి,
బాపట్ల

ఏ ఒక్కదానికీ తాజా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయలేదు.

- చీరాలలో చేనేత క్లస్టర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేవు.
- రేపల్లె, అద్దంకి పట్టణాల్లో ప్రభుత్వ వైద్యశాలలను వంద పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చేస్తామన్నారు.
- బలహీనంగా ఉన్న పెనుమూడి-కృష్ణా కరకట్టను పటిష్టం చేస్తామన్నారు.
- నిజాంపట్నంను వాన్‌పిక్ సిటీగా అభివృద్ధి చేసి మెగా సిటీగా రూపొందిస్తామన్నారు.
- చీరాలలో ఐటీ హబ్ అన్నారు.
- మత్స్యకారుల ఎగుమతులకు తోడ్పాటు, చీరాలలో టెక్స్‌టైల్స్‌పార్కు ఏర్పాటు అన్నారు.
- జిల్లా వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి అన్నారు.
- బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో చివరి ఆయకట్టుకు సాగునీటి తరలింపు, లిఫ్ట్ స్కీములు తీరంలో తుఫాన్ షెల్టర్ల నిర్మాణం అన్నారు.



- ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని బడ్జెట్‌లో కేవలం రూ. 6,300 కోట్లు మాత్రమే కేటాయించారు. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ. 384.07 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేటాయింపుల ప్రకారం జిల్లాకు రూ. 240 కోట్లు కూడా రాదు. కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌తో సరిపెట్టేలా ఉన్నారు.


- ఎన్నికల ముందు తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తామన్నారు. జిల్లాలో గత ప్రభుత్వంలో కుటుంబానికి ఒక్కరు చొప్పున 1,16,019 మందికి రూ.174.02 కోట్లు ఇచ్చారు. ఇప్పుడేమో రూ. 9,407 కోట్లు కేటాయించారు. పట్టుమని 70 శాతం మందికి కూడా సరిపోయే పరిస్థితి లేదు. విద్యా సంవత్సరం ముగిసినా తల్లుల పేర పైసా జమ చేయలేదు.



సూపర్ సిక్స్‌లకు మంగళం

- ఎస్సీ ,ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారు. ఇప్పుడు కూడా బడ్జెట్‌లో నిధులివ్వలేదు.

- డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వరకు రుణాలు అన్నా పైసా కేటాయింపులు లేవు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని గంగలో కలిపారు. ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని సగం మందికి కూడా ఒక్క సిలిండర్ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి, జాబ్‌క్యాలండర్ ప్రస్తావనే లేకుండా చేశారు.



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలు
- మొదటి సంవత్సరం విద్యార్థులు 10,838 మంది
- ద్వితీయ సంవత్సరం 8,381 మంది
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- కంట్రోల్ రూం ఏర్పాటు ఫోన్ నంబరు..08643-220182



బాపట్లలోని పరీక్ష కేంద్రంలో బల్లలపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

బాపట్లటౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 10,838 మంది హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 10,340, ఒకేషనల్ విద్యార్థులు 498 మంది ఉన్నారు. ఈనెల మూడో తేదీ నుంచి జరగనున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 8,381 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 7999 మంది, ఒకేషనల్ 382 మంది హాజరు కానున్నారు. పరీక్షలు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయి. పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంది. విద్యార్థులు కనీసం పావుగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఇన్విజిలేటర్లు, విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ప్యాడ్లు అనుమతించబడవు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కళాశాల పేరుతో ఉన్నటువంటి ఐడీ కార్డులు, యూనిఫామ్ ధరించరాదు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎలాంటి జిరాక్స్, నెట్ సెంటర్లు తెరిచి ఉంచరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తెరిచి ఉంచితే సంబంధిత షాపును సీజ్ చేస్తామని చెప్పారు. జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాలకుగానూ మూడు సెట్ల ప్రశ్న పత్రాలను 16 పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చారు. అన్ని పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. వీరితోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లను, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ముఖ్యంగా నిజాంపట్నంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ఎంజేపీఏపీబీ, సీడబ్ల్యూఆర్‌జేసీ (బాయ్స్), ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖాజీపాలెం డీఎస్ రాజు జూనియర్ కళాశాలల వద్దకు చేర్చేందుకు ఉదయం నిజాంపట్నం కళాశాలల వద్ద 7.30 గంటలకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు కళాశాలల బస్సులు సిద్ధం చేశారు. పరీక్షల కోసం జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్(08643-220182) ఏర్పాటుచేశారు. అన్ని సెంటర్లలో ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులను నియమించారు. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల దూరంలో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ ఉండరాదని అధికారులు సూచించారు.

ఏర్పాట్లు పూర్తి

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లుపూర్తి చేశాం. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పరీక్షల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు.

– పి.యర్రయ్య,
జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి

ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై పురోగతి సాధించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించిన అంశాలలో పురోగతి, లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. డీఆర్‌సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంపుపై నూరు శాతం లక్ష్యాలు చేరుకుని బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయం అన్నారు. 50,965 ఎకరాలలో ఉద్యాన పంటల సాగు జరుగుతుందన్నారు. 46 వేల మంది రైతులు 15 రకాల ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారన్నారు. జిల్లాలో అదనంగా 237 ఎకరాలలో సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఆ లక్ష్యాలను చేరుకోవడంతో బాపట్ల జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. 7,700 మంది మిర్చి రైతులకు అవగాహన కల్పించి, ముందస్తు జాగ్రత్త చర్యలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలన్నీ ఫైవ్ స్టార్ ర్యాంకులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అపార్ ఐడీ నమోదులో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా 14వ స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థుల నమోదు వేగం పెంచాలన్నారు. 2024లో 43.14శాతం మాతృ మరణాలు నమోదు కాగా, శిశు మరణాలు 4.31 శాతం నమోదు అయ్యాయన్నారు. మాతృ, శిశు మరణాల నివారణపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డెంగీ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడిచే వైద్యశాలల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వైద్య సేవలు ప్రజలకు అందించాలన్నారు. డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కుష్ఠు వ్యాధి సర్వేలో 14.55 లక్షల మందిని పరిశీలించగా 12 కేసులు నమోదయ్యాయన్నారు. వారికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. 643 హెల్త్ పింఛన్ల విచారణ పూర్తి కాగా 340 మందికి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. దివ్యాంగుల పింఛన్ పొందే వారు 24,000 మంది ఉండగా, 16 వేల మంది పింఛన్లను విచారించి ధ్రువీకరించామన్నారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్, ఉద్యాన శాఖ ఏడీ జెన్నమ్మ, పరిశ్రమల శాఖ జీఎం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు చర్యలు

బాపట్ల జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. బాల్య, కౌమర కార్మిక వ్యవస్థ చట్టం 2016 ప్రకారం 18 సంవత్సరాల వయస్సు లోపల ఉన్న బాలబాలికలు ఎవరూ కూడా పని ప్రదేశాలలో ఉండకూడదని, అలా ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.వి శివప్రసాద్, బాపట్ల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి జ్యోతి, సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్ పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

పర్చూరు(చినగంజాం): భూముల రీ సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పర్చూరు మండలం రమణాయపాలెంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో భూములను రీ సర్వే చేపట్టే ముందు రైతులకు నోటీసులు జారీ చేయాలన్నారు. రమణాయపాలెం గ్రామంలోని రీసర్వే పనులను మార్చి 13 నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులు తాము పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కలెక్టర్‌ను రైతులు కోరగా ఐటీసీ ప్రతినిధులతో మాట్లాడి పొగాకు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, తహసీల్దార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశం జీవితానికి పెనుప్రమాదం

జిల్లా జడ్జి సయ్యద్ జియాఉద్దీన్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జియాఉద్దీన్

రేపల్లె రూరల్: క్షణికావేశం జీవితానికి పెనుప్రమాదకరమని, ఆవేశంలో చేసే తప్పిదాలతో జీవితాలు నాశనమయ్యే పరిస్థితులు నెలకొంటాయని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియా ఉద్దీన్ అన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శుక్రవారం ఆయన సందర్శించి రిమాండ్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంభించటంతోపాటు తమ కుటుంబం భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విరామ సమయంలో పుస్తక పఠనం అలవరుచుకోవాలన్నారు. నేరం ఆరోపించబడి రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ప్రభుత్వపరంగా న్యాయ సేవలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రైవేటు న్యాయవాదిని ఏర్పరుచుకోలేని వారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చన్నారు. పలు న్యాయ సేవా చట్టాలపై అవగాహన కల్పించారు. సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. 70 సంవత్సరాలు పైబడిన ఖైదీల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలే కూటమి పాలన ధ్యేయం

వైఎస్సార్ సీపీ అద్దంకి ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధించటమే కూటమిపాలన ధ్యేయమని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రశ్నిస్తానని పార్టీ పెట్టి, కూటమితో కుమ్మక్కైన పవన్ కల్యాణ్ గొంతు నేడు మూగబోయిందన్నారు. ప్రశ్నించడమే మర్చిపోయారని ఎద్దేవా చేశారు. సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి సంపద పెంచే మార్గాన్ని ప్రజలనే చెప్పాలని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పటం, ప్రజలను మోసగించటం చంద్రబాబు నైజం అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ఏరులై పారుతోందన్నారు. అద్దంకి అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని తెలిపారు. మంత్రి పదవి చేపట్టిన స్థానిక ఎమ్మెల్యే అద్దంకి అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.